




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్






సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 145 | ఆదివారం 30 నవంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## శ్రీలంకలో దిత్వా తుపాను బీభత్సం

# 123 మంది మృతి

- భారీ వర్షాలు, వరదలకు 123 మంది మృతి..
- 130 మంది గల్లంతు
- 44 వేల మందికి పైగా నిరాశ్రయులు..
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- శ్రీలంకకు అండగా నిలిచిన భారత్..
- ప్రధాని మోదీ సంతాపం

శ్రీలంక -సూర్య వాస్తవం



శ్రీలంకను 'దిత్వా' తుపాను అతలాకుతలం చేసింది. ఈ తుపాను కారణంగా సంభవించిన భారీ వర్షాలు, వరదలతో ఇప్పటివరకు 123 మంది మరణించగా, మరో 130 మంది గల్లంతయ్యారని విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఇళ్లు ధ్వంసం కావడంతో సుమారు 43,995 మందిని ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించినట్టు డీఎంసీ డైరెక్టర్ జనరల్ సంపత్ కొటువెగోడ తెలిపారు. తుపాను శ్రీలంక తీరం నుంచి భారత్ వైపు కదులుతు న్నప్పటికీ, దేశంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాజధాని కొలంబో గుండా ప్రవహించే కెలని నది ఉప్పొంగడంతో నదీ తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రమే ఈ నది ప్రమాదకర స్థాయికి చేరడంతో వందల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపించారు. "సాయుధ బలగాల సహాయంతో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి" అని కొటువెగోడ

- మిగతా 2లో..



## టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో మరో 11 మంది పాత్ర..

- కేసు విచారణను వేగవంతం చేసిన సిట్ అధికారులు
- తొలుత 15 మందిని, తర్వాత మరో 9 మందిని..
- తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేర్చిన సిట్

అమరావతి - సూర్య వాస్తవం

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు విచారణను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) వేగవంతం చేసింది. ఈ కేసులో తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేర్చింది. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని

- మిగతా 2లో..



## ఏపీ తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్

- 2026 మార్చి నుంచి బాధ్యతలు
- 2026 మార్చి 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరణ
- ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్‌కు మూడు నెలల పదవీకాలం పొడిగింపు
- పది మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ మరో ఉత్తర్వు

2వ



## అట్టహాసంగా నేవీ డే సన్నాహక ఉత్సవం

- ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాఖపట్నం- సూర్య వాస్తవం

ప్రతి ఏటా డిసెంబర్ నాలుగున ఇండియన్ నేవీ అట్టహాసంగా నిర్వహించే నేవీ డే ఉత్సవాల సన్నాహక కార్యక్రమం శనివారం సాయంత్రం నేవీ ఆడిటోరియం సాముద్రికలో ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగింది. ఇండియన్ నావెల్ సింఫనీ ఆర్కెస్ట్రా ఆధ్వ ర్యంలో 'స్వర్గం' పేరుతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఆయనకు తూర్పు నావికాదళ కమాండింగ్ అధికారి, వైస్ అడ్మిరల్ సంజరు భల్లా ఘన స్వాగతం పలి కారు. సాముద్రికలోనిసాంస్కృతిక కార్యక్రమాలను పవన్ ఉత్సాహంగా వీక్షించారు. కార్యక్రమం అనంతరం లయన్ కింగ్ మ్యూజికల్ బృందానికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్‌ను తూర్పు నావికాదళాధిపతి సంజరు భల్లా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పవన్ తన తనయుడు అకీరా నందన్‌తో కలిసి హాజరయ్యారు.

# అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి

- టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సిఎం చంద్రబాబు

అమరావతి-సూర్య వాస్తవం, నవంబర్ 29



రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సమయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో చంద్రబాబు కొంతసేపు మాట్లాడారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకనుగుణంగా రాష్ట్రంలో మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాజధాని అమరావతి పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీ పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ ఉందని, తనతో వారు సమావేశమైన తరువాత అన్నింటిపైనా స్పష్టత వచ్చిందన్నారు. రెండో దశ భూ సమీకరణ వల్ల రైతులకే ఉపయోగమని, ఈ అంశాన్ని వారికి వివరించానని తెలిపారు. అమరావతి మున్సిపాల్టీగా మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారని తెలిపారు. రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు అంశాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించానని తెలిపారు. దీనిపై కేంద్రం చర్చించి నిర్ణయం

- మిగతా 2లో..



## ప్రాణ నష్టం లేకుండా చర్యలు

- 'దిత్వా' తుపానుపై హోంమంత్రి అనిత సమీక్ష
- రహదార్లు, వంతెనలపై అప్రమత్తం : మంత్రి జనార్ధన్‌రెడ్డి

అమరావతి -సూర్య వాస్తవం, నవంబర్ 29

దిత్వా తుపాను తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రాణనష్టం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను హెూం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. తుపాను తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆది, సోమవారాల్లో ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు,

- మిగతా 2లో..

## అమరావతి రైతుల సమస్యల పరిష్కారానికి

# త్రిసభ్య కమిటీ భేటీ

- వాస్తు సమస్యలున్న రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయింపు
- నెల రోజుల్లో హెల్త్ కార్డులు, పెన్షన్ల సమస్యల పరిష్కారానికి హామీ
- అమరావతి రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇస్తామన్న పెమ్మసాని


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


అమరావతి-సూర్య వాస్తవం, నవంబర్ 29

రాజధాని అమరావతి రైతుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ తొలిసారి సమావేశమై కీలక అంశాలపై చర్చించింది. ఈ భేటీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ప్లాట్ల కేటాయింపులో సమస్యలు, ఆరోగ్య పథకాలు, పెన్షన్ల పునరుద్ధరణ వంటి అంశాలపై కూలంకషంగా చర్చించారు.

సమావేశం అనంతరం పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాజధాని పరిధిలో 1286 ప్లాట్లకు వీధిపోటు సమస్యలు ఉన్నాయని, మరో 156 మంది రైతులు వాస్తుపరమైన కారణాలతో అసంతృప్తిగా ఉన్నారని గుర్తించినట్లు తెలిపారు. వాస్తు సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేందుకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిలిచిపోయిన హెల్త్ కార్డులు, పెన్షన్ల వంటి సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. అసైన్డ్, లంక భూముల సమస్యలను మిగతా భూముల నుంచి వేరు చేసి, కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. జరీబు-నాన్ జరీబు, గ్రామకంఠం భూముల సమస్యలపై కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. వచ్చే కేబినెట్‌లోనే అసైన్డ్, లంక భూముల సమస్యలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం



- మిగతా 2లో..

## శ్రీలంకలో దిత్వా తుపాను బీభత్సం

# 123 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు వివరించారు.

**లంకకు భారత్ ఆపన్నహస్తం**

ఈ విపత్కర పరిస్థితుల్లో శ్రీలంకకు అండగా నిలిచేందుకు భారత్ ముందుకొచ్చింది. బాధితుల కోసం ఇప్పటికే విమానంలో సహాయ సామగ్రిని పంపింది. శ్రీలంకలో ప్రాణనష్టం పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. అవసరమైతే మరింత సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా సహాయక చర్యల్లో సైన్యాన్ని కూడా రంగంలోకి దించారు. హెలికాప్టర్లు, బోట్ల ద్వారా వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడుతున్నారు. 2016లో సంభవించిన వరదల కన్నా ఈసారి పరిస్థితి తీవ్రంగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏపీ తదుపరి

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్

- 2026 మార్చి నుంచి బాధ్యతలు
- 2026 మార్చి 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరణ
- ప్రస్తుత సీఎస్ కె.విజయానంద్‌కు మూడు నెలల పదవీకాలం పొడిగింపు
- పది మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ మరో ఉత్తర్వు

**అమరావతి–సూర్య వాస్తవం, నవంబర్ 29**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జి.సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఆయన 2026 మార్చి 1వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పదవీకాలాన్ని ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. దీనితో ఆయన 2026 మార్చి 28 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ పొడిగింపునకు సంబంధించి జీవో నంబర్ 2230ను ప్రభుత్వం విడుదల చేసింది.

మరోవైపు రాష్ట్రంలో పది మంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228ను ప్రస్తుత సీఎస్ విజయానంద్ విడుదల చేశారు. పరిపాలనాపరమైన ఈ మార్పులపై ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేయడంతో స్పష్టత వచ్చింది.

## అమరావతి రైతుల సమస్యల పరిష్కారానికి

# త్రిసభ్య కమిటీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. రాజధాని గ్రామాల్లో హెచ్‌డీ లైన్లు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రతి రెండు వారాలకు ఒకసారి వారితో సమావేశమవుతామని త్రిసభ్య కమిటీ ప్రకటించింది.

## టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో

# మరో 11 మంది పాత్ర..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సిట్ కు అప్పగించిన విషయం విదితమే. ఈ కేసులో తొలుత 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసులో మొత్తం 35 మందిపై కేసు నమోదు చేసి, పది మందిని అరెస్టు చేసింది. నిందితుల్లో ఏడుగురు టీటీడీ ఉద్యోగులు ఉండడం గమనార్హం. 2019–2024 మధ్య టీటీడీ కొనుగోలు విభాగంలో పనిచేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఈ కేసులో చేర్చింది. సిట్ నిందితుల జాబితాలో గతంలో టీటీడీలో జీఎంగా పనిచేసిన జగదీశ్వర్ రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రాణ నష్టం లేకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉందని హోంమంత్రికి అధికారులు వివరించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. సహాయక చర్యల కోసం ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను పంపించాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండేవారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. విరిగిన చెట్లు తొలగించడం, విద్యుత్ అంతరాయం జరిగితే పునరుద్ధరణ పనులు వెంటనే జరిగేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తదితరులు పాల్గన్నారు.

**రహదారుల కోతపై దృష్టి సారించాలి : మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి**

తుపాను నేపథ్యంలో నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో రహదారులకు గండ్లు పడటం, కోతకు గురికావడం వంటి అంశాలపై దృష్టిపెట్టడంతోపాటు అప్రమత్తంగా వ్యవహరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మరో సమీక్షలో అధికారులను ఆదేశించారు. రాబోయే 24 గంటలపాటు ఈ మూడు జిల్లాలకు ఫ్లాష్‌ఫ్లడ్స్ ప్రమాదం పొంచి ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, వాగులు, వంకలు, పొంగిపొర్లే ప్రమాదం పొంచి ఉన్న క్రమంలో రహదారులు, వంతెనలపై అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. బలహీనంగా ఉన్న కల్వర్టులు, వంతెనలు కోతకు గురయ్యే అవకాశం ఉన్న రహదారుల విషయంలో ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

**ధాన్యం తడవకుండా చర్యలు : సిఎస్ విజయానంద్**

తుపాను నేపథ్యంలో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అప్రమత్తం చేశారు. మంగళవారం వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలను సహాయ శిబిరాలకు తరలించడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నియమించిన త్రిసభ్య కమిటీ నిరంతరం వారితో సంప్రదింపులు జరుపుతోందన్నారు. రాజధాని రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జెఎసిగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలూ పరిష్కరిస్తామన్నారు. రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కారం చేస్తానని తెలిపారు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ) అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూములు త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా లంచం డిమాండ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తిచేసే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

**2029 ఎన్నికల అజెండాగా శిక్షణ తరగతులు**

పార్టీ కార్యకర్తలకు డిసెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించే శిక్షణ తరగతులు 2029 ఎన్నికల అజెండాగా ఉండాలని చంద్రబాబు చెప్పారు. గ్రీవెన్స్ అనంతరం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో ఆయన సమావేశమయ్యారు. కొత్తతరం నాయకుల్ని తయారు చేయాలని చెప్పారు. ప్రత్యర్థుల ఎత్తుగడల్ని ముందే పసిగట్టే విధంగా యంత్రాంగం తయారు కావాలని చెప్పారు. పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ దిశానిర్దేశం తర్వాత పార్టీ కార్యకర్తల సమావేశాలు, ప్రజావేదికల్లో 5 శాతం పురోగతి కనిపించిందని తెలిపారు. కుప్పం, మంగళగిరి, వినుకొండ, పాలకొల్లు, గజపతినగరం నియోజకవర్గాల్లో అమలవుతున్న క్యాడర్ ఎంపవర్‌మెంట్ విధానం అన్ని నియోజకవర్గాల్లో అమలు కావాలని ఆదేశించారు.

అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో తీసుకెళ్తున్నప్పుడు వనరుల సృష్టి అవసరమని చెప్పారు. పోలవరం వంటి ప్రాజెక్టులు పూర్తయితే సాగునీటి లభ్యత పెరిగి సాగు విస్తీర్ణం పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ, అనుబంధ పంటలకు మార్కెటింగ్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారంపై త్వరలో తానే స్వయంగా మాట్లాడతానని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిఎ వ్యవహారంపై ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. మహిళల విషయంలో నేతలు, పార్టీ శ్రేణులు, మంత్రులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మహిళలకు సంబంధించిన విషయంలో ఆరోపణలు వచ్చిన వ్యక్తిని నిజనిర్ధారణ అయ్యేవరకూ పక్కనపెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, కార్యాలయ కార్యదర్శి పి అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మంత్రి పీఏపై వేధింపుల ఆరోపణలు..

- తక్షణమే తొలగించాలని సీఎంవో ఆదేశం
- గిరిజన మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్‌పై వేధింపుల ఆరోపణలు
- సతీష్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచన
- ఆరోపణల వాస్తవికతపై విచారణ జరపాలన్న సీఎంవో

**అమరావతి –సూర్య వాస్తవం, నవంబర్ 29**




ఏపీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వద్ద అనధికార పీఏగా పనిచేస్తున్న సతీష్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) తీవ్రంగా స్పందించింది. అతడిని తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సతీష్ విధుల్లో కొనసాగడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఓ మహిళ, మంత్రి పీఏ సతీష్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం సీఎంవో దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, ఈ వ్యవహారంలో రెండు వైపులా విచారణ జరపాలని సీఎంవో సూచించడం గమనార్హం. మహిళ చేసిన ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాలని పేర్కొంది. ఒకవేళ ఆమె ఆరోపణలు అవాస్తవమని విచారణలో తేలితే, ఆమెపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

# 'ఆపరేషన్ సాగర్ బంధు'..

- శ్రీలంకకు 12 టన్నుల సహాయ సామగ్రిని పంపిన భారత్
- దిత్వా తుపాన్ బాధితుల కోసం శ్రీలంకకు భారత్ భారీ సాయం
- వాయుసేన విమానంలో 12 టన్నుల సహాయ సామగ్రి తరలింపు
- ఇప్పటికే నౌకల ద్వారా రేషన్, నిత్యావసరాల పంపిణీ




**శ్రీలంక--సూర్య వాస్తవం, నవంబర్ 29**

దిత్వా తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన పొరుగు దేశం శ్రీలంకకు భారత్ తన సహాయ సహకారాలను విస్తరించింది. 'ఆపరేషన్ సాగర్ బంధు'లో భాగంగా భారత వాయుసేనకు చెందిన సీ–130జే విమానం శనివారం సుమారు 12 టన్నుల సహాయ సామగ్రితో కొలంబోలో ల్యాండ్ అయింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. "ఆపరేషన్ సాగర్ బంధు కొనసాగుతోంది. టెంట్లు, టార్పాలిన్లు, దుప్పట్లు, పరిశుభ్రత కిట్లు, తినడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలతో కూడిన 12 టన్నుల సామగ్రి కొలంబో చేరింది" అని ఆయన తెలిపారు. శనివారం కూడా భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ ఉదయగిరి నౌకల ద్వారా శ్రీలంకకు అత్యవసర సహాయాన్ని అందించారు. ఈ నౌకల ద్వారా 4.5 టన్నుల పొడి రేషన్, 2 టన్నుల తాజా రేషన్‌తో పాటు ఇతర నిత్యావసరాలను బాధితులకు పంపిణీ చేసినట్లు కొలంబోలోని భారత హైకమిషన్ పేర్కొంది. దిత్వా తుపాన్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. "మా సమీప సముద్ర పొరుగు దేశానికి సంఘీభావంగా అత్యవసర సహాయ సామగ్రిని పంపాము. అవసరమైతే మరింత సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నాం. 'నైబర్‌హుడ్ ఫస్ట్' పాలసీకి కట్టుబడి కష్టకాలంలో శ్రీలంకకు అండగా నిలుస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.



## ఎమ్మిగనూరు రోడ్డు ప్రమాదంపై

# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..

- అధికారులకు కీలక ఆదేశాలు
- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు కార్లు ఢీకొని ఐదుగురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఘటనపై సీఎం చంద్రబాబు విచారం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు

**అమరావతి –సూర్య వాస్తవం, నవంబర్ 29**

కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు వేగంగా ఢీకొన్న ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ హృదయ విదారక ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలియగానే సీఎం చంద్రబాబు స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు తక్షణమే అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతులంతా కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారని అధికారులు గుర్తించి సీఎంకు నివేదించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తొలివిడత భూముల్లో అభివృద్ధి చేయకుండా

# రెండో విడత సేకరణ ఎందుకు.?

- చంద్రబాబుకు షర్మిల సూటి ప్రశ్నలు
- ఇది రియల్ ఎస్టేట్ మాఫియా కాదా అని తీవ్ర స్థాయిలో ఆరోపణలు
- రాజధాని భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

**అమరావతి - –సూర్య వాస్తవం, నవంబర్ 29**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని కోసం రెండో విడత భూసేకరణ చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఇది రియల్ ఎస్టేట్ మాఫియాను తలపిస్తోందని ఆరోపించారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా?" అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. తొలి విడతలో ప్రభుత్వ భూములతో కలిపి 54 వేల ఎకరాల్లో అభివృద్ధి జరిగిపోయిందని చంద్రబాబు భ్రమల్లో ఉన్నారు. రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో ఒక్క కిలోమీటర్ నిర్మాణం కూడా జరగలేదని, ఐకానిక్ భవనాల ఊసే లేదని విమర్శించారు. అలాంటిది ఇప్పుడు కొత్తగా మరో 16 వేల ఎకరాలు ఎందుకని నిలదీశారు. అదానీ, అంబానీలకు బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. దేశంలోని అతిపెద్ద విమానాశ్రయాలు, అంతర్జాతీయ క్రీడా నగరాలతో పోలుస్తూ అమరావతికి వేల ఎకరాలు ఎందుకని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. ముంబై విమానాశ్రయానికి 1850 ఎకరాలు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 2200 ఎకరాలు సరిపోయినప్పుడు, అమరావతికి 5 వేల ఎకరాలు అవసరమా అని అడిగారు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల్లోనే ఉండగా, ఇక్కడ 2500 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. రాజధాని భూములపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. రెండో విడత భూసేకరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం విభజన హామీలో భాగమని, అది కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడగకుండా శాలువాలు కప్పి సన్మానాలు చేయడం ఏంటని ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు.

## యోగాలో పీహెచ్.డి అందుకున్న డి. సరిత



**తిరుపతి– సూర్య వాస్తవం, నవంబర్ 29:** యోగా రంగంలో విశిష్టమైన పరిశోధన చేసిన డా. డి. సరితకు తన పరిశోధనకు గాను పీహెచ్.డి పట్టాను కేంద్ర క్యాబినెట్ మంత్రి, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రదానం చేశారు. ఈ పరిశోధనను డా. అఖిలేష్ సింగ్ కుమార్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. నూతనజన శిశువుల ఆరోగ్యంపై యోగాభ్యాసాల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన ఈ పరిశోధనకు విశేషమైన గుర్తింపు లభించింది. ఇది డా. సరిత కు రెండవ పీహెచ్.డి. ఆమె మొదటి పీహెచ్.డి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రసాయన శాస్త్రంలో పూర్తి చేశారు. శాస్త్రం మరియు యోగా లో ద్వంద్వ పటిమ కలిగిన ఆమె, యోగా ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చే దిశగా పనిచేయాలన్నది తన దృష్టి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె, “నా లక్ష్యం యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం” అని పేర్కొన్నారు.

## వైకాపా సీనియర్ కార్యకర్తని పరామర్శించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్



**పులివెందుల– సూర్య వాస్తవం, నవంబర్ 29:** పులివెందుల పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన వైకాపా నాయకుడు శ్రీరంజన్ రెడ్డి ఇటీవల కాలంలో కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్రీరంజన్ రెడ్డిని శనివారం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప , మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేరంగుల చంద్రమౌళి, కనక ,సంపత్ మొట రాజశేఖర్ శ్రీరాములు రంగాపురం మధుసూదన్ రెడ్డిలు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుంటూ, అధైర్యపడవద్దు పార్టీ అండగా ఉంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు. బాగా విశ్రాంతి తీసుకొని తొందరగా కోలుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విలువలతో మెలగండి



**సింహాద్రిపురం – సూర్య వాస్తవం, నవంబర్ 29:** విద్యార్థులు మానవతా విలువలతో మెలగాలని పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డివి.కొండారెడ్డి అన్నారు. సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్ అధ్యక్షతన శనివారము జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు .విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం పై జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబం సమాజం పట్ల మంచి దృక్పథము కలిగి ఉండాలన్నారు .ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్ ,మానవత కన్వీనర్ బీవీ కృష్ణారెడ్డి ,అధ్యక్షులు జి చంద్రశేఖర్ రెడ్డి ,కార్యదర్శి ఎం వి శేషయ్యలు మాట్లాడుతూ విద్యార్థులు నైతిక ,మానవీయ విలువలు కలిగి ప్రవర్తించినప్పుడే ఉత్తమ సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. సమావేశంలో పద్మనాభరెడ్డి , సూర్యచంద్రారెడ్డి, సోమశేఖరరెడ్డి, బి.శైలజ ,జయప్రకాశ్ రెడ్డి ,భగీరతి తదితరులు కూడా ప్రసంగించారు. విద్యార్థులు నైతిక విలువలు అనే అంశముపై మానవత ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వపు పోటీల్లో ప్రధమ , ద్వితీయ స్థానాలలో విజేతలుగా నిలిచిన తెలుగు మీడియం విద్యార్థులు పి భాగ్యలక్ష్మి ,ఏ బిందు ,ఇంగ్లీష్ మీడియానికి చెందిన కె .అభినయశ్రీ ,టి లాస్యలహరి లకు మెమొంటోలతో పాటు పైళ్లను కూడా మానవత సంస్థ ప్రధానము చేసింది .కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్య, ఉపాధి కల్పనలో వైజిఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**- కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి**

**సింహాద్రిపురం– సూర్య వాస్తవం, నవంబర్ 29**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో విద్యా, ఉపాధి కల్పనలో వై జి ఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం బెంగళూరులో కన్నడ రజతోత్సవ సంబరాలు - 2025 శ్రీ ఆదిత్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మందికి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మండలంలోని నంద్యాలంపల్లికి చెందిన వై జి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్ర నాగు శ్రీధర్ రెడ్డి విద్యా ఉపాధి రంగంలో అందించిన సేవలకు సత్కరించారు. ఈ సందర్భంగా కర్ణాటక మంత్రి మాట్లాడుతూ విద్యా, ఉపాధి కల్పనలో శ్రీధర్ రెడ్డి ఎంతో అద్భుతంగా పనిచేస్తున్నారని అన్నారు.

ప్రజల కోసం, సమాజ అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేసే నాయకులు ఎంత అరుదో అందరికీ తెలిసిన విషయమే అన్నారు. అలాంటి అరుదైన సేవా స్ఫూర్తితో నిరంతరం ప్రజల మధ్య పనిచేస్తూ, సమస్యలను వినిపిస్తూ, పరిష్కారాలను అందిస్తూ, సామాజిక సేవను జీవన



విధానంగా మార్చుకున్న వ్యక్తి శ్రీధర్ రెడ్డి అన్నారు. శ్రీ ఆదిత్య ఫౌండేషన్ చైర్మన్ సునీత రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు మన ప్రాంతం సామాజికంగా, సాంస్కృతికంగా ఎదగడంలో శ్రీధర్ రెడ్డి పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేసే ప్రతిష్టాత్మక గౌరవం అని ఆమె తెలియజేశారు. యువతకు దారి చూపడంలో ప్రదర్శించిన నాయకత్వం, విద్య, సేవ,సంఘీభావ కార్యకలాపాల్లో చేసిన విశేష కృషి ఈ అవార్డుకు నిజమైన అర్హతను తెలియజేస్తాయన్నారు. అవార్డు గ్రహీత శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం తో నా బాధ్యతలు మరింత పెరిగాయి అన్నారు.

భవిష్యత్తులో మరింత స్థాయిలో సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల అభ్యున్నతే తమ ట్రస్టు లక్ష్యన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల కరపత్రం ఆవిష్కరణ

**వేంపల్లి -సూర్య వాస్తవం, నవంబర్ 29**

నేడు రాయలసీమ నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సును కడప నగరం బీసీ భవన్ ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అధ్యక్షులు బి. రామాంజనేయులు, పిలుపునిచ్చారు. శని వారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా వేంపల్లి మండల సమితి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి విడుదల చేయడం జరిగిందిరాయలసీమ నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సుకు ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ, రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల. సత్యనారాయణ, హాజరవుతున్నారు.ఈ సందర్భంగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా అధ్యక్షులు బి. రామాంజినేయులు, మాట్లాడుతూ... భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేస్తామని ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది దీనితో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆశగా కూటమి ప్రభుత్వానికి



అనుకూలంగా ఓటు వేసి గెలిపించుకోవడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్న సంక్షేమ బోర్డు చైర్మన్ ను మాత్రమే నియమించింది అన్నారు కానీ పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ ను పరిష్కారం చేయలేదని వారు మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ రంగా సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్నా దాదాపు 50 వేల పైగా లైన్స్ ను పెండింగ్లో ఉన్నాయన్నారు. 2019 సంవత్సరంలో జగన్ ప్రభుత్వం హయాంలో సంక్షేమ బోర్డు నిర్వీరం చేస్తూ జీవో నెంబర్ 12, 14 ను జారీ చేయడం వలన కార్మికుల క్లెయిమ్స్ లు పెండింగ్లో ఉండిపోయాయి అన్నారు. వెంటనే కూడా ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు పునః ప్రారంభించడం కోసం నేడు కడపలో జరిగే రాయలసీమ నెల్లూరు జిల్లాల ప్రాంతీయ సదస్సును భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండల అధ్యక్షులు దస్తగిరి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సిద్దయ్య, చలపతి, కోశాధికారి బుజ్జి, శీను, మల్లికార్జున చిన్న టోపీవలి. తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

**- సీపీఐ గోవింద్**

**పామిడి -సూర్య వాస్తవం, నవంబర్ 29:** పామిడి పట్టణంలో షాదీఖానాలో నిర్వహించిన సీపీఐ 100వ శతాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవింద్ పిలుపునిచ్చారు.



పామిడి మండల కేంద్రంలోని షాదీఖానాలో శనివారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికైన గోవింద్‌ను పార్టీ నాయకులు కే. రహీం, నాగరాజు, చౌడప్ప, కోదండరామిరెడ్డి పూలమాలతో సత్కరించారు.భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తొలుత పోరాటం ప్రారంభించిన పార్టీ సీపీఐ అని గోవింద్ గుర్తుచేశారు. కొన్ని ఎకరాల భూమిని పంచడంతో పాటు కార్మిక, విద్యార్థి, యువజన, రైతు, మహిళా వంటి ప్రజా సంఘాలను నిర్మించి, కర్షక–కార్మిక హక్కుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన పార్టీగా సీపీఐ ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

**లింగాల -సూర్య వాస్తవం, నవంబర్ 29:** లింగాల మండల కేంద్రంలోని ఉపాధ్యాయు లకు క్రీడా పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో 29 వ తేదీ శనివారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై అనిల్ కుమార్ మరియు మండల విద్యాశాఖ అధికారులు సి. విశ్వనాథరెడ్డి ఎంఈఓ-1,బి



రామకృష్ణయ్య ఎంఈఓ-2 ఆధ్వర్యంలో పురుషులకు క్రికెట్, మహిళలకు ద్రోబాల్ పోటీలు ప్రారం భించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ శారీరిక దృఢత్వం అందరికీ అవసరం ఎలాంఅనిల్ కుమార్ మాట్లాడుతూ శారీరిక దృఢత్వం, మానసిక ఉల్లాసం అందరికీ అవసరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం అవసరం అంతేకాక మండలాలలో పాఠశాలలోని విద్యార్థుల భద్రత గురించి మాట్లాడడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి-2 రామకృష్ణయ్య పాఠశాల భద్రతల భాగంగా అమ్మాయిల గురించి వారి భద్రత గురించి పాఠశాలలో తీసుకోవలసిన అమ్మాయిల భద్రత విషయములో పోలీసు వారి సహకారం తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఎంఈఓ 1 విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మానసిక శారీరక ఉల్లాసానికి క్రీడలు ప్రభుత్వం నిర్వహించడం మనం భాగస్వాములు కావడం చాలా సంతోషమని తెలిపారు. మండలంలోని పురుష ఉపాధ్యాయులను రెండు టీములుగా విభజించి క్రికెట్ పోటీ నిర్వహించడం జరిగింది. అలాగే మహిళా ఉపాధ్యాయులకు త్రోబాలు పోటీ నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో సెలెక్ట్ కాబడిన ఉపాధ్యాయులు క్రికెట్ మరియు త్రో బాల్ ఆటలు డిసెంబర్ మాసంలో 13,14 తేదీలలో పులివెందుల పులివెందుల తేదీలలో డివిజన్ స్థాయిలో జరుగు పోటీలలో పాల్గొంటారని పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె విక్టర్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో త్రిబుల్ ఐటీ విద్యార్థులు

**వేంపల్లి - సూర్య వాస్తవం, నవంబర్ 29**

ఆర్.కె.వాలీ క్యాంపస్‌కు చెందిన ఎన్ ఎస్ ఎస్ యూనిట్-4 ఆధ్వర్యంలో, ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి కోటేశ్వరి మార్గదర్శకత్వంలో గండి గ్రామంలో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాపగ్ని నది పరిశుభ్రత కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులు నదిలో పేరుకు పోయిన వ్యర్థ వస్త్రాలు, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త మొదలైన వాటిని సేకరించి నది పరిసరాలను శుభ్రపరిచారు. గ్రామ ప్రజలతో కలిసి విద్య ప్రాముఖ్యం పై అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.ఈ సేవా కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు అభినందిస్తూ విద్యార్థుల సేవా భావం,



పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిన చైతన్యాన్ని ప్రశంసించారు.

## అమృత వర్షిణి బాల కళ్యాణ ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ జన్మదిన వేడుకలు





**గుంతకల్లు- సూర్య వాస్తవం :** గుంతకల్లు పట్టణంలో 14వ వార్డ్ నాయకుడు మద్దికేర ప్రతాప్ ఆధ్వర్యంలో అమృత వర్షిణి బాల కళ్యాణ ఆశ్రమంలో ముందుగా కేక్ కట్ చేసి వైవిఆర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథులుగా సీనియర్ నాయకులు,వైయస్సార్ సీపి మేదావుల సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లారెడ, ఉపాధ్యాక్షులు అనంతసేన రెడ్డి, ఐటీ వింగ్ నియోజక వర్గ అధ్యక్షులు సూర్య ప్రకాష్ రెడ్డి, ఎస్టీ సెల్ నియోజక అధ్యక్షులు కొనకొండ్ల అంజి, పట్టణ వైస్ ప్రసిడెంట్ నవీన్ విచ్చెశారు. వారు మాట్లాడుతూ జనం కోసం ప్రతి నిమిషం ఆలోచించే ప్రజా నాయకుడు గుంతకల్లు నియోజకవర్గం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికీ అప్పుడు తెలుసుకుంటూ ప్రజా సమస్యలు వైపు అడుగులు వేస్తున్న మన మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మరలా 2029లో ఖచ్చితంగా మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బట్నాపాడు రామాంజినేయులు, పెద్దన్న, జి ఆర్ శ్రీనివాసులు, సుబ్బారావు, మద్దికేర రవి, వెంకటేష్, జట్కా దిలీప్ కూమార్, వలి, నవీన్, వైవిఆర్ మస్తాన్, యెట్టి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై కఠిన చర్యలు

**- మోటార్ వాహన చట్టం 1988 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి**
**- జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్**






**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, నవంబర్ 29:** మోటారు వాహన చట్టం 1988 లోని నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై కట్టిన చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలు పాటించని ఈఐబిలను స్వాధీనం చేసుకుంటామని జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా కమిషనర్ సూచనల మేరకు, అన్నమయ్య జిల్లా రవాణాశాఖ విద్యా సంస్థ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిందని జిల్లా రవాణాశాఖ అధికారి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ తనిఖీలో భాగంగా, 75 ఈఐబిలను తనిఖీ చేసి భద్రతా నిబంధనలను పాటించనందుకు నోటీసులు జారీ చేశామని, పర్మిట్ లేని ఒక ఈఐబిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మోటారు వాహన చట్టం, 1988,దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం వారి బస్సుల భద్రతా నిబంధనలను పాటించాలని అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలకు తెలిపామని పేర్కొన్నారు. పర్మిట్, ఫిట్‌నెస్, బీమా, పన్ను, డ్రైవింగ్ లైసెన్స్ లేని విఐపి లను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈఐబి డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించకూడదని మరియు డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. విద్యార్థుల భద్రత కోసం ఈఐబిలు సరైన అగ్నిమాపక వ్యవస్థలు మరియు అగ్నిమాపక యంత్రాలను నిర్వహించాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం, 1988ని ఉల్లంఘించే ఈఐబి లను చట్ట ప్రకారం నిబంధనల మేరకు అదుపులోకి తీసుకుంటామన్నారు.తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం

### -శ్రీ స్వామివారి సేవలో

### అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వానాధికారి



**వేంపల్లి ,సూర్య వాస్తవం, నవంబర్ 29 :** శ్రీ స్వామివారి హనుమత్ వ్రతం సందర్భంగా 3.12.2025 తేదీన బుధవారం ఉదయం శ్రీ స్వామి వారి ఆలయంలో నిర్వహించు కార్యక్రమం వివరాలు పంబా నది కలశ ఆవాహన. పుణ్యా వచనం. హనుమత్ వ్రత కథలు. మన్య సూక్త. పంచసూక్త. సుదర్శన. నరసింహ. పంచముఖ హనుమాన్. హోమం. సింధూర అర్చన. నాగవల్లి దళంతో తమలపాకులు సహస్రనామం. పూర్ణాహుతి . శాతమురై. స్వామి వారి మహా మంగళ హారతి. తీర్థ ప్రసాదం వినియోగం .భక్తులందరూ కూడా స్వామివారి హోమంలో పాల్గొనుటకు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు, పూజలో పాల్గొనదలచిన భక్తాదులో సాంప్రదాయ దుస్తులతో రావలెను,హోమానికి,పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు,వోట్టి కొబ్బెర గిన్నె, నెయ్యి ప్యాకెట్ . పసుపు కొమ్ములు. ఒట్టి ఖర్జూరం,పసుపు( లేక )ఎరుపు రంగు గల జాకెట్ పీస్ అన్ని తీసుకువచ్చి స్వామివారి మహా పూర్ణాహుతిలో సమర్పించుటకు భక్తులందరికీ అవకాశం ఉన్నది .కావున ప్రతి ఒక్కరూ స్వామి వారి హెూమంలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు ఆగుదురని కోరుచున్నాను.

# జిల్లాలో పడే ప్రతి నీటిబొట్టును వృధా కానివ్వకండి

**- సప్లై చానల్స్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను పూర్తి చేయాలీ**
**- రామాపురం మండలంలోని సప్లై చానల్స్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, నవంబర్ 29:** జిల్లాలో పడే ప్రతి నీటిబొట్టును వృధా కానివ్వకుండా సప్లై చానల్స్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను పూర్తి చేయాలని నీటిపారుదల, వెలిగల్లు ప్రాజెక్టు అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. శనివారం రామాపురం మండలంలోని నల్లగుట్ట పల్లి పంచాయతీ బి.రాచపల్లి గ్రామ పరిధిలోని రామరాజు వంక నుండి బల్లిగుట్ట చెరువు సప్లై ఛానల్ పనుల ను, రామరాజు వంక చెక్ డాం నిర్మాణానికి సంబంధించిన పనులను, రామరాజు వంక నుండి ఓబుల్ రెడ్డి చెరువు, కసిరెడ్డి చెరువుకు, దిగువ చింతల వారి కుంట, చింతకుంట నింపు సప్లై ఛానల్ పనులను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి దీనికి సంబంధించిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని రానున్న వర్షాకాలంలో నీటిని వృధాగా పోనికుండా చెరువులు అన్ని నింపే ప్రక్రియ పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



ఈ సప్లై ఛానల్ ద్వారా చెరువులు నీరు నింపడం వలన బల్లగుట్టపల్లి చెరువు ద్వారా దాదాపు 225 ఎకరాలకు, కసిరెడ్డి చెరువు, ఓబుల్ రెడ్డి చెరువు ద్వారా దాదాపు 109 ఎకరాలకు నీరు అందించడం జరుగుతుందని అన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాలలో ప్రతి చెరువు నీరు నింపే విధంగా సప్లై ఛానల్ పనులు చేపట్టే విధంగా ప్రణాళికలను తయారు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు.ఈ సందర్భంగా ఈనెల 30వ తేదీ పదవి విరమణ చెందుతున్న నీటిపారుదల శాఖ ఎస్ ఈ వెంకటరామయ్య కు జిల్లా కలెక్టర్ పూల మొక్కను అందించి శాలువాతో సన్మానించారు. ఈ జిల్లాకు తాను వచ్చిన కొంత కాలంలోనే వెంకటరామయ్య సరైన సహకారం తోడ్పాటు, సలహాలు, సూచనలు ఇచ్చారని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈవెంకట రామయ్య, తహసీల్దార్, ఎంపిడి ఓ, ఏ ఈ భాష, వీఆర్వో, వీఆర్ఏలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, నవంబర్ 29:** స్క్రిప్ట్ యువతలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే దాన్ని బారిన పడకుండా ఉంటారని, ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలని కోరారు అడిషనల్ డీ ఎం హెచ్ వో డాక్టర్ రాధిక, లాయర్ భారతి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్. డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవం ను పురస్కరించుకొని డైట్ కళాశాలలో రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 30 మందికి పైగా మహిళలు విద్యార్థినిలు పాల్గొన్నారు. ఎయిడ్స్ రావడానికి గల కారణాలు వ్యాపిస్తే ఎలా చికిత్స చేసుకోవాలి తెలియజేసీ విధంగా రంగోలి ముగ్గులు ద్వారా తెలియజేశారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన పెంచడం, ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడం ఎయిడ్స్ వ్యాధి కారక హెచ్ఐవి కి వ్యతిరేకంగా పోరాడడం కోసం ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపు కుంటా మన్నారు. కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్ మాట్లాడుతూ రాబోయే వరల్డ్ ఎయిడ్స్ డే క్యాండిలైట్ డే, కమ్యూనిటీ ఫిస్ట్,కళాశాలలో కాంపిటీషన్స్ కల్చర్ ప్రోగ్రాం, ఐ ఈ సి కార్యక్రమాల్ని 15 రోజుల పాటు నిర్వహిస్తామని వివరించారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ రాధిక రంగోలి (ముగ్గుల ),కొవ్వొత్తుల ర్యాలీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని కోరుకున్నారు. ఇందులో భాగంగా హైరిస్కు గ్రూపు వారికి మరియు హెచ్ఐవి బాధితులకు ప్రత్యేకమైన కార్యక్రమాన్ని రంగోలి ముగ్గుల పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని పాల్గొని కార్యక్రమం లో ముగ్గుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎయిడ్స్ పట్ల అవగాహన కొరకు ప్రతి ఏడాది కూడా మా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందని చెన్నా రెడ్డికి తెలిపారు. ఈ రంగోలి ప్రోగ్రాంలోబాగా వేసిన టువంటి ప్రతిభావంతులకు మూడు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ స్వాతి తో పాటు ఇతర సిబ్బంది, అల్లా వలి,వారి సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉమెన్స్ డిగ్రీ కళాశాల విశ్వప్రసాద్ , విద్యార్థినిలు, మహి ళలు పాల్గొన్నారు.

### విద్యార్థులలోని

# సృజనాత్మకతను వెలికి తీయాలి: స్కీమ్స్ ఎడి



**కదిరి -సూర్య వాస్తవం, నవంబర్ 29:** ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్కీమ్స్ ఏడి వినయ్ మోహన్, జిసిడిఓ అనిత పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ ను నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కు విశేష స్పందన వచ్చింది.విద్యార్థులు ఇన్నోవేటివ్ వంటకాలతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతపై సందేశాలు అందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రతినిధులు పాల్గొని పిల్లల సృజనాత్మకతకు శభాష్ అన్నారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫలాల స్టాల్స్ జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి వంటి ఫలాల పోషక విలువలతో కూడిన పండ్ల స్టాళ్లు అందర్నీ ఆకట్టుకున్నాయన్నారు. అదేవిధంగా కూరగాయల కార్నర్ పాలకూర, బీట్‌రూట్, క్యారెట్ లాంటి కూరగాయల ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులు వివరించడంతో సందర్శకులు ఆసక్తిగా చూశారు. హెల్తీ డ్రింక్స్ నిమ్మరసం, బటర్‌మిల్క్, టెండర్ కొబ్బరి నీరు, పుదీనా-జాగరీ డ్రింక్ విద్యార్థులు తయారు చేసి పంచారు. ఎక్కువ నూనె ఉపయోగం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన స్టాల్ ను ఏర్పాటు చేశారు. తక్కువ నూనెతో వంటలు ఎలా తయారు చేయాలి? అనే అంశంపై డెమో కూడా నిర్వహించారు. పిల్లల ఆనందం, పాఠంవిద్యార్థులు "ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది" అనే సందేశంతో ఆహారం-ఆరోగ్యం అనుబంధాన్ని సరదాగా పరిచయం చేశారు.




కార్యక్రమంలో ఎంఈఓ ఓబుల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎన్ లియాకత్ ఆలీ ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, శివ, లావణ్య , వరలక్ష్మి , హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి హెల్పర్లకు దరఖాస్తుల ఆహ్వానం



**లక్కిరెడ్డిపల్లి –సూర్య వాస్తవం, నవంబర్ 29:** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గాలివీడు మండలం పక్కిరారెడ్డి గారిపల్లె,అరవీడు కస్పాలకు చెందిన అంగన్వాడి కేంద్రాలలోని హెల్పర్లు (ఆయా) దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి ఐసి డిఎస్ సిడిపిఓ జహారభి శనివారం తెలియజేశారు.డిసెంబర్ 7వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందవలెనని తెలిపారు.పూర్తి వివరాల కోసం లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు.

## పామిడిలో ఘనంగా
## మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ జన్మదిన వేడుకలు



**పామిడి–సూర్య వాస్తవం, నవంబర్ 29:** గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పామిడి పట్టణంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నకేశవరెడ్డి పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైవిఆర్ కు వైయస్సార్సీపి నాయకులందరూ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ మన మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మరలా 2029లో ఖచ్చితంగా మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏపీ ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ జీవీ రెడ్డిని
## కలిసిన టీడీపీ యువ నాయకుడు





**వేంపల్లి –సూర్య వాస్తవం :** ఏపీ ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ జీవీ రెడ్డి నూతన లా కార్పొరేట్ ఆఫీస్ ఓపెనింగ్ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి తన స్నేహం బృందంతో కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## చెరువులకు నీరు
## ఇవ్వడమే కూటమి లక్ష్యం

**- చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే కోట్ల, డిసిఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్**





**ప్యాపిలి– సూర్య వాస్తవం:** డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియ,డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ శనివారం రోజున ప్యాపిలి మండలంలోని హుసేనాపురం చెరువును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఈ సందర్శనలో పాల్గొని చెరువు ప్రస్తుత పరిస్థితి, నీటి పారుదల సామర్థ్యం, వర్షాకాలం లో వచ్చే నీటి ప్రవాహం, సాగునీటి అవసరాలపై వివరమైన నివేదికను సమర్పి ంచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ చెరువు పరిసరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు.ప్రజలకు మెరుగైన నీటి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో మానసిక ఉల్లాసం





**లక్కిరెడ్డిపల్లి –సూర్య వాస్తవం, నవంబర్ 29:** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉత్తేజానిస్తాయని లక్కిరెడ్డిపల్లి మండలం ఇంచార్జ్ యనమల మదనమోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను శనివారం లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారులు చక్రె నాయక్,వెంకట సుబ్బయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యనుముల మదన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విద్య , క్రీడలకు అధిక ప్రాధాన్యతిస్తున్నారని కావున విద్యతో పాటు క్రీడలలోనూ రాణిస్తూ మానసి కంగానూ, శారీరకంగా దృఢత్వం పొందాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు క్రీడల్లోనూ మెలకువలు నేర్పించి విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని తెలిపారు.ఈ సంవత్సరములో నిర్వహించినటువంటి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో మన లక్కిరెడ్డిపల్లి మండల విద్యార్థులు అనేక విభాగాలలో ప్రత్యేక ప్రతిభ చూపించి ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలం నుండి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినటువంటి ఉపాధ్యాయులకు 20వేల రూపాయలు బహుమతి అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీనాయక్, హాస్పిటల్ చైర్మన్ వెంకటరామరాజు, కావలి ఆంజనేయులు, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, జడ్పీహెచ్ స్కూల్ చైర్మన్ బాబు, డీలర్ అన్వర్, తెలుగు యువతమండల అధ్యక్షుడు పక్కిరయ్య, గురు స్వామి సోడు వెంకటేశ్వర్లు, పూజ, సయ్యద్ రిజ్వాన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నదాతల మంచి కోరే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

**- జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి త్రాగు నీరు అందించేలా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషి**

**- శ్రీనివాస్ పురం,వెలిగల్లు జలాశయం ద్వారా సాగునీరు అందించేందుకు అన్ని రకాల చర్యలను చేపట్టిన మంత్రి మండిపల్లి.**

**- రైతన్న మీ కోసం కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్ రెడ్డి టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్**



**అన్నమయ్య బ్యూరో– సూర్యవాస్తవం, నవంబర్ 29:** అన్నదాతల మంచి కోరే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి నీరు అందించేలా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృషి చేస్తున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంగంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మండలాధ్యక్షులు గండికోట సుధాకర్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రాయచోటి మండలం పేమ్మాడపల్లి గ్రామంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారి సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డిల ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేమ్మాడపల్లి టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి రైతుకు అందిన పథకాలను అడిగి తెలుసుకున్నారు. కుల మతాలకతీతంగా పార్టీలకతీతంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి యువనేత నారా లోకేష్ లు ప్రతి ఒక్కరికి సూపర్ సిక్స్ పథకాలు అందించారని వివరించారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి నివాస గృహాలు మంజూరు చేసేలా అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించినట్లు వారు తెలియజేశారు.



## టీ.సి. ప్రభుత్వ హై స్కూల్‌లో
## అట్టహాసంగా ఫుడ్ ఫెస్టివల్










**పామిడి –సూర్యవాస్తవం :** పామిడిలోని టీ.సి. ప్రభుత్వ హై స్కూల్‌లో వోకేషనల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం నాడు "ఫుడ్ ఫెస్టివల్ 2025"ను అట్ట హాసంగా నిర్వహించారు. విద్యార్థుల వృత్తి నైపుణ్య అభివృద్ధి, ప్రాక్టికల్ లెర్నింగ్ మరియు ఆహార ప్రాసెసింగ్ పట్ల ఆసక్తి పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా ఏర్పాటు చేసినట్లు ప్రధానో పాధ్యాయులు కె. రామకుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న వోకేషనల్ ట్రైనర్స్:ఫుడ్ ప్రాసెసింగ్ జె. రామదేవి ఎలక్ట్రానిక్‌హార్డ్‌వేర్ బి. సత్యంఆటోమోటివ్ జె. హర్ష వర్ధన్ విద్యార్థులు వివిధ రకాల సాంప్రదాయ, ప్రాంతీయ, మిలెట్స్ ఆధారిత వంటకాలు, హెల్తీ ఫుడ్ ఐటమ్స్‌ను ప్రత్యేకంగా సిద్ధం చేసి సందర్శకులకు ప్రదర్శించారు. ఫుడ్ ప్రాసెసింగ్ మోడల్స్, ప్రిజర్వేషన్ విధానాలు, లైవ్ కుకింగ్ డెమోస్ కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా మార్చాయి.ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ఇన్నోవేటివ్ వంటకాలు, పోషకాహారంపై అవగాహన స్టాల్స్, హైజీన్ ఫుడ్ సేఫ్టీ పద్ధతులపై వివరాలు అందించబ డ్డాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకత, టీమ్‌వర్క్, ప్రెజెంటేషన్ స్కిల్స్, మార్కెటింగ్ ,ఎంట్రప్రెన్యూర్షిప్ నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహి ంచినందుకు పాఠశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది.

## కస్తూరిబా విద్యాలయాన్ని
## తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**గాండ్లపెంట –సూర్య వాస్తవం ,నవంబర్ 29:** మండల కేంద్రంలోని కటారుపల్లి క్రాస్ లో ఉన్న కస్తూరి బా విద్యాలయాన్ని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు ఆహార సౌకర్యం, విద్యా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా శాసనసభ్యుడు అయినటువంటి కందికుంట వెంకటప్రసాద్ ను పిల్లలు ఆడుకోవడానికి తమకు ప్లేగ్రౌండ్ సదుపాయం కల్పించాలని వారు కోరారు. దానికి అయినా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు ,వీఆర్వో కిష్టప్ప ,ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రామాంజులురెడ్డి, చిన్నోడు, రవి ,ప్రసాద్ ,సూర్య శేఖర్ రెడ్డి ,నాగ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం ఆన్‌లైన్ ప్రశ్నా పత్రం విడుదల

**- ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి**



**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 29**



నేషనల్ మీన్స్-మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ మరియు ఫిజికల్ సైన్స్ ఫోరం సంయుక్తంగా రూపొందించిన ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తన నివాసంలో అధికారికంగా పబ్లిష్ చేశారు. ఈ ప్రశ్నాపత్రం 30వ తేదీ ఉదయం 10 గంటలకు విద్యార్థులు, ప్రజలు అందరూ ఉపయోగించుకునేలా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది. ఈ ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి. మహేశ్వర్ రెడ్డి కి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశ్నాపత్రం రూపకల్పనలో కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు, ఎం ఈఓలు పాల్గొన్నారు. విద్యార్థుల ఎన్ఎంఎంఎస్ పరీక్షా సిద్ధతకు తోడ్పడే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

# జనసేన వైపు అందరి చూపు

**- పులివెందుల జనసేనలో మైనారిటీలకు పెద్దపీఠం**

**వేంపల్లి - సూర్య వాస్తవం, నవంబర్ 29**



పులివెందుల నియోజకవర్గంలో మైనారిటీ లకె పెద్దపీఠం దక్కుతుందని భారీ గా, స్థానిక సంస్థలో మరియు పార్టీ విభాగం లో కూడా మైనారిటీ లకు స్థానం కల్పించడానికి జనసేన అధిష్టానం సమయత్నం చేస్తుందని, అన్ని వర్గాల ప్రజలను సమ న్యాయం చేస్తుందని, ముఖ్యంగా వేంపల్లి, పులివెందుల మండలాల్లో మైనారిటీ లకు మంచి స్థానం కల్పించడానికి సమయత్నం చేస్తుందని, ముఖ్యంగా మైనారిటీ నాయకులు కూటమి విజయం కోసం కష్టపడ్డారని అలంటి నాయకులు ప్రాధాన్యత కల్పించడమే జనసేన ధేయం అని జనసేన, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగాలని, జనసేన పులివెందుల సమన్వయ కర్త డాక్టర్. హరీష్ కు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రాం తాళ్లూరి కేంద్ర కార్యాలయంలో వినవించడం జరిగింది. విశ్వాసనీయ వర్గాల ద్వారా పార్టీ కేంద్ర కార్యాలయనికి అందిన సమాచారం మేరకు మైనారిటీ హక్కుల పరట సమితి అధ్యక్షులు మహబూబ్ బాషా మైనారిటీ నాయకులు అహ్మద్‌అలీ, వంటి వారు మొగు చూపుతున్నారాని, కష్టపడి పని చేసే వారు అందరు ఆహ్వానితులే అని తెలపడం జరిగింది.

# మహిళల బద్రతపై అవగాహన సదస్సు

**- సిఐ టి.నరసింహులు**



**వేంపల్లె - సూర్య వాస్తవం, నవంబర్ 29**

మహిళల బద్రతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా కడప ఎస్పీ మరియు డి.ఎస్.పి ఆదేశాల మేరకు వేంపల్లె సీఐ టి.నరసింహులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం వేంపల్లి పట్టణంలోనీ ఉషా కిరణ్ హైస్కూల్ లో మహిళల బద్రత, పోక్సో చట్టం ప్రాముఖ్యత, బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, ఆన్లైన్ బద్రత విషయాలు, వచ్చే ప్రమాదాలను గుర్తించడం, అనుమానస్పద లింక్ లు, అనుచితమైన సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలిస్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అలాగే విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ అలాగే చిన్న వయసులో జరిగే బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. బాలికలు తమ విద్యను పూర్తి చేసుకుని స్వతంత్రంగా ఎదగడం ఎంతో అవసరమన్నారు. పోలిస్ విభాగం తరుపున మహిళలకు ఎల్లవేళలా రక్షణ అందించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. శక్తి యాప్ ద్వారా రక్షణ పొందవచ్చని, ఇది మహిళలకు రక్షణ కవచంలా ఉపయోగ పడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉండాలి

**- సంస్థగత నిర్మాణ కార్యకర్తల సమావేశంలో కన్యాకుమారి ఎంపీ విజయ్ వసంత్**






**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 29**

పులివెందులలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పులివెందుల నియోజకవర్గంలో మండలాల నాయకులతో , కార్యకర్తలతో సంస్థాగత నిర్మాణ కార్యక్రమం పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్యాకుమారి ఎంపీ విజయ్ వసంత్, ఏఐసిసి సెక్రటరీ గణేష్ యాదవ్, డిసిసి అధ్యక్షురాలు విజయ జ్యోతి, ఏపీ పీసీసీ ప్రధాన కార్యదర్శి తమ్మటం నరసింహులు, రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ సోమశేఖర్, డిసిసి ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, మదనపల్లి ఇంచార్జ్ మల్లెల పవన్ కుమార్ రెడ్డి, లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటినుండే కార్యాచరణలు పూర్తి చేయాలన్నారు. ఓటర్ లిస్టులో పేర్లు మార్పులు చేర్పులు 20 ఉంటే చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అన్నారు. నాయకులు ప్రజలకుఎప్పటికీ అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల లో పర్యటించాలన్నారు.అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి వేమయ్య, వేంపల్లి మండల అధ్యక్షులు రామకృష్ణ, కిసాన్ చల్ అధ్యక్షుడు పసుపులేటి బద్రీనాథ్, చక్రాయపేట మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, వైస్ చైర్మన్ అంజి నాయక్, పులివెందుల మహిళా అధ్యక్షురాలు విజయ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి చేయూతనందించండి

**- సహకరించిన ప్రతి ఒక్కరూ సంకల్ప సారధులే**

**- ఆర్థిక, స్థానిక సమస్యలు వెంటాడుతున్న అకుంఠిత దీక్షతో ముందుకెళ్తున్న రామ మోహన్**

**లింగాల - సూర్య వాస్తవం, నవంబర్ 29**

లింగాల మండలం రామనూతలపల్లె గ్రామ పరిధిలో ప్రధాన రహదారి సమీపంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి చేయూతనందించాలని, సహకారాలు అందించే ప్రతి ఒక్కరూ భగవంతుని సంకల్ప సారధులే అని, అనేక ఆంక్షలు అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ అకుంఠిత దీక్షతో ముందుకెళ్తున్నామని ఆలయ నిర్మాణ సారధి మేకల రామ్మోహన్ పేర్కొన్నారు. రామనూతలపల్లె గ్రామ పరిధిలో 0.75 సెంట్ల విశాల పరిధిలో గ్రామీణ వాతావరణం లో కోటి 50 లక్షల నిర్మాణ వ్యయంతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరగగా, పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో అందించిన 55 లక్షల రూపాయలు, దేవాదాయ శాఖ ద్వారా అందిన ఇరవై ఒక్క లక్ష రూపాయలు, ఇతర దాతల సహాయ సహకారాలతో వసతి రూములు, ప్రహరీ గోడ, అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో ఆధ్యాత్మిక శోభతో శ్రీకృష్ణుని మూలాలు ప్రతిబింబించేలా ఆలయ నిర్మాణం కొనసాగుతోందని అయినప్పటికీ అన్ని రకాల పనులు పూర్తికావించుకొని విగ్రహ ప్రతిష్ట వరకు చేరుకొని పూజలు అందుకునేందుకు మరిన్ని వనరులు అవసరమైన నేపథ్యంలో దాతల సహాయ సహకారాలను అభ్యర్థిస్తున్నామని, దేవాలయాలు మన పూర్వీకుల నిర్మాణ మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని సూచిస్తాయని, దాతలు అందించే విరాళాలు భవిష్యత్ తరాలకు ఈ వారసత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయని, హిందూమతంలో ఆలయ నిర్మాణానికి తోడ్పడటం గొప్ప పుణ్యకార్యంగా పరిగణించబడతాయని, విరాళాలను ప్రియమైన వారి జ్ఞాపకార్థం లేదా దైవానికి కృతజ్ఞత అర్పణంగా పరిగణించబడతాయని కావున భక్తాదులు ఆలయ నిర్మాణ పనులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని, మరింత సమాచారం మరియు సహకారం అందించేందుకు రామ మోహన్ 97043 21311 ను సంప్రదించడం ద్వారా మరిన్ని వివరాలు పొందగలరని తెలియజేశారు.




# బెస్ట్ ఉమెన్ టీచర్ 2025కు మహేశ్వరమ్మ ఎంపిక

**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 29**

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజినీరింగ్ కాలేజ్ బెస్ట్ ఉమెన్ టీచర్ 2025 కు పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శేష మహేశ్వరమ్మ ఎంపికయ్యారు. పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ కి 2025 సంవత్సరానికి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ శయెస్టా అఖ్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఉమెన్ ఇంజినీరింగ్ కాలేజ్ టీచర్ అవార్డు సిఫారసు చేయబడి 55వ ఐ ఎస్ టి ఈ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సులో ముఖ్య అతిథి మాజీ కేంద్రమంత్రి మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్,ముంబై డాక్టర్ సత్యపాల్ సింగ్, డాక్టర్ ప్రతాప్ ప్రతాప్సిన్హ్ కాక సాహెబ్ దేశాయి,ఐ ఎస్ టి ఏ ఈ ప్రెసిడెంట్ చేతుల మీదుగా ప్రధానం చేయబడింది. ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం 2025 నవంబర్ 29న పుదుచ్చేరి లోని శ్రీ మనకుల వినయగర్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ"ఈ గుర్తింపు నాకు ఒక గొప్ప గౌరవం మాత్రమే కాదు, నా వృత్తిపర ప్రయాణంలో ఒక వినయపూర్వకమైన మైలురాయిగా భావిస్తున్నాను. మా విశ్వవిద్యాలయ పరిపాలకులు, వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. విష్ణువర్ధన్, శ్రేయోభిలాషులు, సహోద్యోగులు, విద్యార్థులు మరియు గురువులకు వారి నిరంతర సహకారం, ప్రోత్సాహం, ఆశీర్వాదాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రవాణా శాఖ కఠిన చర్యలకు సిద్ధం

- నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ఆర్టీవో ఉక్కుపాదం
- పత్రాలు లేని వాహనాలు, భద్రతా లోపాలపై స్పాట్ ఫైన్స్
- అవసరమైతే వాహనాలు సీజ్ - విద్యార్థుల భద్రతే ప్రాధాన్యం
- నాయుడుపేటలో స్కూల్ వాహనాలపై రవాణా శాఖ సడన్ రైడ్
- ఫిట్నెస్ లేనీ వాహనాలు నడిపితే - యంవిఐ అనిల్ కుమార్ హెచ్చరిక
- నియమాలు పాటించకపోతే ఇక ఉపశమనం లేదు
- స్కూల్ బస్సులపై ఆర్టీవో కఠిన చర్యలు








**నాయుడుపేట- సూర్య వాస్తవం, నవంబర్ 29:** తిరుపతి జిల్లా నాయుడుపేట శ్రీకాళహస్తి హైవే వద్ద శనివారం ఉదయం సూళ్లూరుపేట యంవిఐ అనిల్ కుమార్ వాహనాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా స్కూల్ వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టీ విద్యార్థుల ప్రాణ భద్రతను తీవ్రంగా ప్రమాదంలోకి నెట్టే నిర్లక్ష్యంపై యంవిఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ"డ్రైవింగ్ లైసెన్సులు, రూట్ పర్మిట్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్ వంటి పత్రాలు తప్పనిసరిగా వాహనాల్లో ఉండాలి. డ్రైవర్‌కు యూనిఫాం, ఐడీ కార్డ్, వాహనంలో ఎమర్జెన్సీ డోర్ పనిచేయాలి. ఫైర్ ఎక్స్టింగ్విషర్ లేకపోవడం, పిల్లలను నిర్దేశిత పరిమితికి మించి తీసుకెళ్లడం తీవ్రమైన నేరం" అని హెచ్చరించారు. గత నెలలో స్కూల్ వాహన యజమానులకు మొదటి హెచ్చరిక ఇచ్చినా, ఇంకా పత్రాలు సరిగా లేని వాహనాలు తిరుగుతున్నాయని యంవిఐ స్పష్టంచేశారు. "మరోసారి మా యొక్క తనికలో తారసపడితే భారీ జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేసే చర్యలు తప్పవని " అని చూచించారు. స్కూల్ విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ స్కూల్ బస్సులను లక్ష్యంగా చేసుకొని, ఎమర్జెన్సీ డోర్ పనితీరు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ లభ్యత, పిల్లల సంఖ్య వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించినట్లు యంవిఐ అనిల్ కుమార్ తెలిపారు.



# డైరెక్టర్ కోసం హీరో వెయిటింగ్ !

అన్నీ అనుకున్నట్లు జరిగితే ఎల్ సీ యూ నుంచి ఖైదీ 2ఇప్పటికే మొదలవ్వాలి. కానీ కార్తీ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండగా, లోకేష్ కనగరాజ్ తన పనుల్లో తాను బిజీగా ఉన్నాడు. మరి ఈ డిలేకి కారణం ఏంటి? అంటే? కొన్నాళ్ల పాటు డైరెక్షన్ పక్కన బెట్టి హీరోగా లక్ చెక్ చేసుకోవడమే. కూలీ రిలీజ్ అనంతరం లోకేష్ కనగరాజ్ హీరోగా మ్యాకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. అరుణ్ మాథేశ్వర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. లోకేష్ మార్క్ క్రైమ్ థ్రిల్లర్ కావడం..హీరో ఛాన్స్ అనే సరికి లోకేష్ కూడా వెయిటింగ్ ఎందుకునుకున్నాడో? ఏమో గానీ మారు మాట్లాడకుండా పట్టాలెక్కించాడు ప్రాజెక్ట్. డిసెంబర్ లో రెండు రిలీజ్ లతో: డీసీఅనే టైటిల్ తో తెరకెక్కుతోన్న చిత్రమిది.

మరి ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అంటే వచ్చే ఏడాది సమ్మర్ వరకూ రిలీజ్ కాదు. మరి ఖైదీ2 మొదలయ్యేది ఎప్పుడు? అంటే రిలీజ్ తర్వాతేనని తెలుస్తోంది. దీంతో లోకేష్ కోసం కార్తీ వెయిట్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం కార్తీ హీరోగా మార్షల్అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా తప్ప మరే సినిమా షూటింగ్ దశలో లేదు. కార్తీ నటించిన వా వాతయార్ ఇప్పటికే రిలీజ్ కు రెడీ గా ఉంది. డిసెంబర్ లో ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. కార్తీ నటిస్తోన్న మరో చిత్రం సర్దార్ 2 కూడా షూటింగ్ పూర్తి చేసుకుంది. కార్తీకి ఇదో కొత్త ఎక్స్ పీరియన్స్: ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమా వచ్చే ఏడాది ఆరంభంలో రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి కార్తీ కేవలం ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది.

ఆ రెండు రిలీజ్ అయితే వాటి నుంచి పూర్తిగా రిలీవ్ అవుతాడు. కొత్త కథలు వినే ఛాన్సుంది: సాధారణంగా హీరోల కోసం డైరెక్టర్లు వెయిట్ చేస్తుంటారు. కానీ లోకేష్-కార్తీ మధ్య సన్నివేశం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. మరి ఈ గ్యాప్ లో కార్తీ ఏం చేస్తాడు? అంటే కొత్త కథలు వినడానికి అవకాశం ఉంది. మార్షల్ కూడా నత్తనడకన షూటింగ్ జరుతుంది. దీంతో కార్తీ కి సమయం ఎక్కువగానే దొరుకుతుంది. షూటింగ్ ఉంటే చేయడం లేదంటే కథలు వినడంపైనే దృష్టి పెడుతున్నట్లు తెలుస్తోంది.

## 2026 లో
# లేడీ సూపర్ స్టార్ లైనప్ ఇలా!



లేడీ సూపర్ స్టార్ నయనతార 2025లో టెస్ట్ అనే ఒకే ఒక్క చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించింది. గత ఏడాది కూడా బియోండ్ ది ఫెయిరీ టేల్ అనే చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇలా రెండేళ్ల కాలంలో కేవలం రెండు సినిమాలతోనే థియేటర్లోకి వచ్చింది. దీంతో వెండి తెరపై నయన్ కనిపించి చాలా గ్యాప్ వచ్చినట్లు అభిమానులు భావిస్తున్నారు. కానీ కొత్త ఏడాదిలో మాత్రం 2024-25 లెక్కలన్నింటిని సరిచేయబోతుంది. అమ్మడు 2026లో వరుస సినిమాలతో అలరించడం ఖాయం. మనాన్ ఘాటీ సిన్స్%-% 1960 షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసింది. ఆన్ సెట్స్ లో బిజీ బిజీగా: ప్రస్తుతం ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఆసినిమా రిలీజ్ కానుంది. అలాగే తమిళ్, మలయాళంలో తెరకెక్కిన డియర్ స్టూడెంట్స్ అనే చిత్రం కూడా విడుదలవుతుంది. ఆసినిమా కూడా చిత్రీకరణ ముగించుకుని నిర్మాణానంతర పనుల్లో ఉంది. జనవరిలో సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రంతోనూ అలరించనుంది. ఇందులో అమ్మడు మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే టాక్సిక్అనే పాన్ ఇండియా చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. యశ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది. నయన్ నామ సంవత్సరం సమ్మర్ కానుకగా చిత్రం రిలీజ్ కానుంది. పేట్రియేట్ అనే మలయాళం చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే తమిళ్ లో మూకుత్తి అమ్మన్ 2హాయ్రఖియే అనే మరో మూడు చిత్రాల్లోనూ నటిస్తోంది. ఈ మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. వీటిలో రెండు చిత్రాలు 2026 మిడ్ లో, మరో సినిమా ఏడాది ముగింపులో రిలీజ్ కానున్నాయి. తాజాగా నటసింహ బాలకృష్ణ 111వ చిత్రంలోనూ హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. బాలయ్య తో కలిసి నాల్గవ సారి నటిస్తోంది. మొత్తంగా 2026 లో అమ్మడు తొమ్మిది రిలీజ్ లతో ప్రేక్షకుల్ని అలరించడం ఖాయం. చాలా కాలం త ర్వాత నయన్ ఒకే సారి ఇన్ని సినిమాలతో రావడం ఇదే. కొత్త ఏడాదిలో మాత్రం వరుస రిలజ్ లతో అభిమానుల్లో మళ్లీ జోష్ నింపనుంది.



# పాక్ కంటే కిందకి... గంభీర్ రిపోర్ట్ కార్డ్ ఇదిగో!



దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా రెండో టెస్టులోనూ చిత్తయిన సంగతి తెలిసిందే. తొలి టెస్టులో 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక ఓటమిపాలవ్వడం ఒకెత్తు అయితే.. రెండో టెస్టులో ఏకంగా 408 పరుగుల తేడాతో ఘోరంగా ఓడిపోవడం మరొలెక్క అని అంటున్నారు. ఇలా దక్షిణాఫ్రికా చేతిలోనూ వైట్ వాష్ కి గురైంది భారత్. అంతకు ముందు న్యూజిలాండ్ చేతిలోనూ సొంతగడ్డపై 3-0 తో వైట్ 'వాష్' చేయించుకుంది! అవును... టీమిండియా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ ను 2-0 తేడాతో గెలుచుకుంది. కివీస్ 3-0 ఇచ్చిన స్ట్రోక్ తర్వాత ఇది రెండోది. మిస్టర్ డిపెండబుల్, ది వాల్ రాహుల్ ద్రావిడ్ స్థానంలో గౌతమ్ గంభీర్ భారత ప్రధాన కోచ్ గా నియమితులైన అనంతరం ఇప్పుడు భారత జట్టును మూడు ఫార్మాట్లలోనూ నిర్వహిస్తున్నాడు. అయితే.. ఇప్పుడు టీమిండియా పెర్ఫార్మెన్స్ తో అతని రిపోర్ట్ కార్డుపై చర్చ మొదలైంది.

పాకిస్థాన్ కంటే కిందకు!: దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్ ను టీమిండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో పాకిస్థాన్ కంటే వెనుకబడి, ఐదో స్థానానికి పడిపోయింది. దీంతో... డబ్ల్యూటీసీ ఫైనల్ కు చేరుకోవాలనే భారత్ ఆశలను మరోసారి దెబ్బతీసే అవకాశం ఉందని అంటున్నారు.

గంభీర్ కు వ్యతిరేకంగా నినాదాలు!:

దక్షిణాఫ్రికా చేతిలో రెండో టెస్టులో టీమిండియా ఘోరంగా ఓటమిపాలైన అనంతరం గువాహటి మైదానంలో కోచ్ గౌతమ్ గంభీర్ కు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తాయి. బహుమతి ప్రధానోత్సవ సమయంలో గంభీర్ మైదానంలోకి రాగా.. అతను రాజీనామా చేయాలంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎవరు ఎంత వారించినా వారు ఏమాత్రం తగ్గకుండా నినాదాలు చేశారు.

# ధోని - విరాట్ కలిస్తే ఆ ఊపే వేరప్పా..



ఈ ఇద్దరు గురుశిష్యులు టీమిండియాకు చేసిన సేవలు అన్నీ ఇన్నీకాదు.. ధోని విజయంతమైన కెప్టెన్ అయితే.. విరాట్ విజవంతమైన ఆటగాడిగా నిలిచాడు. ఇలాంటి దిగ్గజ క్రికెటర్ల మధ్య బాంధవ్యం ఇప్పటికీ ఉంది. వీరి కలయిక ఇప్పటికీ సోషల్ మీడియాను ఊపేస్తుంది. అందుకే వీరి కలయిక ఎప్పుడూ సోషల్ మీడియాను ఊపేస్తూనే ఉంటుంది. టీమిండియా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా రాంచీకి చేరుకుంది. ఈ తరుణంలో భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావశీలురులైన ఎం.ఎస్. ధోని , విరాట్ కోహ్లీ ఒకే చోట కనిపించిన అరుదైన సందర్భం అభిమానులలో పండగ వాతావరణాన్ని సృష్టించింది. ఈ ఇద్దరు ఐకానిక్ క్రికెటర్లు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం కోట్లాది మంది ఫ్యాన్స్‌కు ప్రత్యేక ఉత్సాహాన్ని ఇచ్చింది. రాంచీ వీధుల్లో హల్ చల్ ధోని ఫార్మ్‌హౌస్‌లో టీమిండియాకు ఆత్మీయ ఆహ్వానం రాంచీ ధోని స్వస్థలం. అక్కడ అతడు నిర్మించుకున్న విశాలమైన ఫార్మ్‌హౌస్, ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాసం, ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సూపర్‌బైక్స్, లగ్జరీ కార్ల గ్యారేజ్ ఎంతో ప్రసిద్ధి చెందాయి. రాంచీకి వచ్చిన టీమిండియా ప్లేయర్లందరినీ ధోని తన ఇంటికి ఆహ్వానించి వారికి ప్రత్యేక విందు ఏర్పాటు చేశాడు. టీమ్ ఇప్పటికే రాంచీకి చేరుకుని తమ ప్రాక్టీస్‌లో నిమగ్నం కాగా, ఈ విరామ సమయంలో ధోని వారందరితో ఆత్మీయంగా గడిపినట్టు సమాచారం. సరిగ్గా రెండు వారాల్లో.. హైదరాబాద్ కు ఫుట్ బాల్ లెజెండ్: రేవంత్ విరాట్ కోహ్లీ, ధోని గ్యారేజ్ సందర్శన.. ఇంటర్నెట్ షేక్! సోషల్ మీడియాను మొత్తం షేక్ చేస్తున్న దృశ్యాలలో విరాట్ కోహ్లీ ధోని గ్యారేజీలో ఉన్న వాహనాల అపురూప కలెక్షన్‌ను చూసి ఆశ్చర్యపోతూ ఉన్న ఫోటోలు ప్రముఖంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు ఇప్పటికే లక్షలాది లైకులు, వేలల్లో కామెంట్లు, కోట్లల్లో వీక్షణలు నమోదయ్యాయి. ధోని , విరాట్ ఇద్దరూ ఆత్మీయంగా మాట్లాడుకుంటున్న వీడియోలు ఫ్యాన్స్‌ను మరింత ఉత్సాహంలో ముంచెత్తుతున్నాయి. %శ్రీంశీ =ఖుఎ% - డబ్ల్యూపీఎల్ వేలం.. శ్రీచరణికి బొనాంజా.. దీప్తికి భారీ ధమాకా రాంచీ ప్రాంత వంటకాలతో అద్భుతమైన విందు జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ధోని తనకు ప్రత్యేకమైన రాంచీ ప్రాంత ఫేమస్ వంటకాలతో పాటు, పారంపరిక వంటకాల నుంచి ప్రీమియం డిలైట్స్ వరకు అన్నింటినీ స్వయంగా పర్యవేక్షిస్తూ ఆటగాళ్లందరికీ కుటుంబ సభ్యుల్లా ఆతిథ్యం ఇచ్చారు. టీమ్ ఇండియా ప్లేయర్లు కూడా ఈ ఆతిథ్యానికి ఎంతగానో ముగ్ధులయ్యారని "ధోని ఇచ్చిన ఆతిథ్యం మర్చిపోలేనిది" అంటూ తమ ఆనందాన్ని పంచుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. వైట్ వాష్ పై గిల్ రియాక్షన్ ఇదే! క్రికెట్‌లో ఇద్దరు లెజెండ్స్: నాస్టాల్జియాలోకి అభిమానులు ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా.. అతని ప్రభావం క్రికెట్ ప్రపంచంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. విరాట్ కోహ్లీ ప్రస్తుతం జట్టుకు తనదైన శైలిలో సేవలందిస్తున్నారు. మాత్రం ఎప్పటికీ మారదు అని అభిమానులు సంబరపడుతున్నారు.

# కిటకిటలాడుతున్న కనేకల్ సచివాలయాలు

**- ఇళ్ల పట్టాల దరఖాస్తుల రద్దీపై తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి**



**కనేకల్– సూర్య వాస్తవం, నవంబర్ 29:** రాష్ట్రంలోని ఇళ్ల పట్టాల దరఖాస్తు నమోదు ప్రక్రియ వేగవంతం కావడంతో చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో, కనేకల్ పట్టణంలోని సచివాలయాలు భారీ రద్దీతో కిటకిట లాడుతున్నాయి. నవంబర్ 30 చివరి తేదీ కావడంతో శనివారం కూడా ప్రజలు భారీగా సచివాలయాలను ఆశ్రయించారు. ఉదయం నుంచే మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిలబడి దరఖాస్తులు సమర్పించారు.దీంతో సచివాలయాల పరిసరాలు జనసందోహంతో సందడిగా మారాయి .గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో కొంత అసౌకర్యం ఎదురైనా, ఇళ్ల పట్టాలు పొందాలనే ఆసక్తి ప్రజల్లో స్పష్టంగా కనిపించింది.

**ఆకస్మిక తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో.**

ఈ రద్దీ పరిస్థితిని పరిశీలించేందుకు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి నిన్నటి రోజున సచివాలయం-2ను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. గుంపులుగా నిలబడకుండా క్యూ లైన్‌లో నిలబడి సేవలు పొందాలని మైకు ద్వారా సూచనలు చేశారు.“ఎవరూ ఆందోళన చెందవద్దు. ప్రతి ఒక్కరి దరఖాస్తు స్వీకరించబడుతుంది. క్రమశిక్షణగా క్యూ పాటించండి,” అని ప్రజలకు ఆయన సూచించారు.

**సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు**

సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి చంద్రమౌళి మాట్లాడుతూ, అధిక రద్దీ ఉన్న నేపథ్యంలో సేవలను వేగవంతం చేయాలని సూచించారు. అవశ్యకమైతే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.అంతేకాకుండా, సిబ్బంది దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం అందిస్తూ, సచివాలయం-1లో కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలియజేయాలని సూచించారు.

**ప్రజల్లో ఉత్సాహం**

ఇళ్ల పట్టాల పంపిణీపై ప్రభుత్వం తీసుకున్న తాజా చర్యలతో ప్రజల్లో ఆసక్తి పెరిగినట్లు గమనించబడింది. తమకు గృహ పత్రాలు దొరుకుతాయన్న నమ్మకంతో అనేక మంది దరఖాస్తుదారులు ముందుగానే సచివాలయాలకు చేరుకున్నారు.మహిళలు రద్దీ కారణంగా నిలబడటానికి ఇబ్బంది పడుతుండడంపై, ప్రత్యేక క్యూ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు.

# రగ్బీ రాష్ట్ర ఛాంపియన్స్ నెల్లూరు బాలురు

**- బాలికల విజేత తూర్పుగోదావరి**

**- బహుమతులు పంపిణీ చేసిన సోమిరెడ్డి**



**నెల్లూరు -సూర్య వాస్తవం, నవంబర్ 29:** నెల్లూరు జిల్లా, పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ అండర్ -17 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ లో ప్రకాశం, నెల్లూరు జట్లు తలపడగా నెల్లూరు జట్టు విజేతగా నిలిచింది.రన్నర్ గా ప్రకాశం జిల్లా జట్టు గెలుపొందింది. అలాగే అండర్-17 బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా గుంటూరు జిల్లా జట్టు నిలిచింది.ˉ ఫైనల్ మ్యాచ్ లో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు హోరహోరిగా తలపడ్డాయి.చివరకు తూర్పు గోదావరి విజేతగా నిలిచింది.విజేతలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బహుమతులను అంద జేశారు. టోర్నమెంట్ రగ్బీ ఆర్గనైజర్ పోతురాజు రమేష్ పర్య వేక్షణలో అట్టహాసంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన సోమిరెడ్డి విజేతలకు బహుమతులతో పాటు సొంత నగదును మొదటి స్థానం 12,000రూ,రెండవ స్థానం 8,000 రూ,మూడో స్థానం 5,000రూ చొప్పున క్రీడాకారులకు నగదు పురస్కారాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమ శిక్షణతో పాటు క్రమం తప్పని శిక్షణ అవ సరమన్నారు. క్రీడాకారులు గెలుపోవటములను సమానంగా తీసుకోవాలని ఓటములకు కృంగిపోకుండా పట్టుదలతో సాధిస్తే విజయాలు సొంతమ వుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, రాష్ట్ర రగ్బీ అబ్జర్వర్ నాగమల్లేశ్వరరావు,ఐ పి మహబూబ్ బాషా, డిప్యూటీ డివో వెంకటేశ్వర నాయక్, సెక్రెటరీ రమణయ్య, డాక్టర్ దేవిక,జి శ్రీనివాసులు,టీడీపీ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, దేవరం రఘురామి రెడ్డి,అమార్థాలూరు చెంచయ్య, గుర్రం మీరా మధు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు సన్మానం



**వేంపల్లి – సూర్య వాస్తవం, నవంబర్ 29:** తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వేంపల్లి ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మ పదవీ విరమణ సన్మాన సభ పాఠశాల సిబ్బంది విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని మేడందాదాపు 43 సంవత్సరాల సుదీర్ఘకాలం ఉపాధ్యాయులు సేవ చేయడం ఎంతో గొప్ప కార్యమని, ఈ అవకాశం అరుదుగా కొంతమందికే వస్తుందని, పాఠశాలకు మేడంగారు చేసిన సేవలు మరువలేమని కీర్తించారు. అలాగే ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శివ మునెమ్మ మాట్లాడుతూ.. దాదాపుగా మూడు సంవత్సరాల పాటు ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా సేవలు అందించే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉందని. సిబ్బంది , విద్యార్థులు అందరూ చక్కని సహకారం అందించాలని అందరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ పదవ తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా పరీక్షకు సిద్ధమై మంచి ఫలితాలు సాధించాలని వారికి దీవెనలు అందజేశారు. పాఠశాల సిబ్బంది ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ ఉత్తమ విద్యార్థులను సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. శివ మునెమ్మ పదవి విరమణ సందర్భంగా గౌరవార్థం ఎన్‌సీసీ విద్యార్థులుస్కౌట్ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి తప్పు వాయిద్యాలతో పూల జల్లులతో పాఠశాల ఆవరణ నుండి పులివెందుల రోడ్డులోని ఏపీజీబీ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి ఘనంగా పదవీ విరమణ పలికా.కార్యక్రమంలో ఉపాధ్యా యినీ,ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

**- అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన పొగురూరు గ్రామం శివ స్వాములు, ఆంజనేయ స్వాములు, భవానీ స్వాములు**



**పామిడి– సూర్య వాస్తవం:** అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష అని అయ్యప్ప మాలదరణ స్వీకరించిన అయ్యప్ప భక్తులు శనివారం మండలంలోని పొగూరురు గ్రామంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప నామస్మరణతో మారుమోగించారు. గురుస్వాములు ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులుతో కలిసి అయ్యప్ప భజనలలో శివ స్వాములు భవాని స్వాములు ఆంజనేయ స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప విగ్రహాలకు స్వాముల ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించి, స్వామి వారికి పూజాధి కార్యక్రమాలు చేసి, స్వామియే శరణమయ్యప్ప అంటూ మాలాధారణ భక్తులు పడిపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.అనంతరం అయ్యప్ప భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదానాలను స్వీకరించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# దిత్వా తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**



**నాయుడుపేట -సూర్య వాస్తవం ,నవంబర్ 29:**దిత్వా తుఫాన్ ప్రభావం దృష్ట్యా నవంబర్ 29, 30,డిసెంబర్ 1వ తేదీలలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో గాలులతో కూడిన భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతా వరణశాఖ హెచ్చరించిన నేప ధ్యం లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రతి ఇంటి భద్రత తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని తెలిపారు.తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.నీట మునిగే ప్రాంతాలు,బీచ్ ప్రాంతాలు,చెట్ల కింద, పాత ఇళ్ల దగ్గర వుండకూడదన్నారు. అవ సరమైతే మాత్రమే బయటకు రావాలని పేర్కొన్నారు.అలాగే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూ చించారు. తుఫాన్ సమయంలో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమాచారం అందిం చేలా ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

# శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకి వినతి

**గాండ్లపెంట -సూర్య వాస్తవం ,నవంబర్ 29:** మండలంలోని కటారుపల్లి గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని శనివారం గ్రామ పర్యటనకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కు గ్రామస్తులు విన్నవించారు.ఈ మధ్య జరిగిన రీసర్వేలో ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిక దేవాదాయ భూముల్లో ఉం దనితేలడంతో ఆశాఖ నుండి అభ్యంతరం వ్యక్తమౌతోందని తమకు స్థలం కేటాయించాలని కోరగా,దానికి సానుకూలంగా ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వ భూమి ఉంటె సర్వే చేసి కేటాయిస్తామని,లేకపోతె సొంత నిధులతో స్థలం కొని, రిజిస్టర్ చేయిస్తానన్నారు. అలాగే కాంపౌండ్ గోడ కూడా నిర్మిస్తామన్నారు. గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజల కోసం పనిచేయాలి

**- ఎంపీపీ జి. సోమశేఖర్ రెడ్డి**

**గాండ్లపెంట–సూర్యవాస్తవం ,నవంబర్ 29:**స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ జి. సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో టి. రామకృష్ణను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఏపీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి ఉపాధి కూలీల మెటీరియల్ బిల్లులుగా ?8.50 కోట్లు, 2025–26 సంవత్సరానికి కొత్త సాఫ్ట్‌వేర్ అమలులో భాగంగా ?4.37 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మార్చి నాటికి అన్ని పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.ప్రతి జాబ్ కార్డు ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేయాలి.

# పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు

**- సూర్య వాస్తవం వార్తా కథనానికి స్పందన**



**గాండ్లపెంట–సూర్యవాస్తవం ,నవంబర్ 29:** మండల కేంద్రంలో నవంబర్ 24వ తేదీ ప్రచురితమైనటువంటి “లోపించిన పారిశుధ్యం పట్టించుకోని అధికారులు” అనే శీర్షికకు అధికారులు స్పందించి గాండ్లపెంటలోని తూపల్లికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చెత్తకుప్పను, రెక్క మాను గ్రామంలోని హై స్కూల్ వద్ద ఉన్న కాలవలోని మురికి చెత్తను అంత పరిశుభ్రం చేయడం జరిగింది. అదేవిధంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ... నిత్యం ఇలాగే పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని ఇలా చేయటం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా బడికి వెళ్లే పిల్లలు రోగాల వారిని పడకుండా ఉంటారని ప్రజలు తెలిపారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

**-నాలుగవ పట్టణ సీఐ**

**- సైబర్ నేరాలలో చిక్కకుండా ఉండాలంటే అవగాహన, అప్రమత్తత అవసరం**

**- పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించిన అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులు**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, నవంబర్ 29:** విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, శక్తియాప్ ప్రయోజనాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను సరైన మార్గంలో ఉపయోగించకపోవడం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి వినియోగం వల్ల ఆరోగ్యానిక, భవిష్యత్తుకు కలిగే నష్టాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, , పోక్సో చట్టాల ప్రాముఖ్యతను తెలియజేశారు.అత్యవసర సేవల కోసం డయల్ 100/ 112 సేవలను వినియోగించే విధానాన్ని వివరించి, ఈ సదస్సుల ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.





PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )